
ప్రజాశక్తి
ఆదివారం 12 ఫిబ్రవరి 2023
5
విజయనగరం



సంగాంలో సిఐ పర్యటన

ప్రజాశక్తి-వంగర

మహా శివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 18 నుంచి వారం రోజులపాటు సంగాంలో జాతర జరగనున్న నేపథ్యంలో రాజాం రూరల్ సిఐ ఉపేంద్రరావు ఆ గ్రామంలో పర్యటించారు. అక్కడ చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. నాగావళి, సువర్ణముఖి, వేగావతి నదులు కలిసే త్రివేణి సంగమం, పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులతో సిఐ మాట్లాడి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గణపతి రావు, ఆలయ కమిటీ చైర్మన్ బోను ఆనందరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ



సదస్సులో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

- లక్షలాది మందితో కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీ
- కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం
- సిఐటియు, వ్యవసాయ కార్మిక, రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం, కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ, లక్షలాది మందితో జరుగుతున్న కార్మిక,కర్షక ఐక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి రైతు సంఘం కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కెఎల్‌పురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సదస్సు జరిగింది. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్య నారాయణ ప్రధాన వక్త గా పాల్గొని ప్రసంగించారు.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లు దోచుకుంటున్నారన్నారు. దేశ ప్రజలపై ఎక్కువ పన్నులు మోపడంతో మధ్యతరగతి, సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నవరత్నాలుగా పేరొందిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. లేబర్ కోడ్ ల పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తున్నారని అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు రక్షణగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. కౌలు రైతులకు రక్షణ లేదన్నారు. కేంద్రం విధానాలతో రాజ్యాంగం పెను ప్రమాదంలో పడిందని. దేశ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. ఈ ప్రజావ్యతిరేక, మతోన్మాద, నియంతత్వ భాజపా ప్రభుత్వానికి బుద్ధి చెప్పకుంటే ఈ దేశ సంపద అంతా అదానీ, అంబానీల చేతుల్లోకి వెళ్లిపోతుందని అన్నారు.ఈ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్యతతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రైతులకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని, సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి కూలి రోజుకు రూ.600ఇవ్వాలని, కౌలు రైతులకు సమగ్ర చట్టం తేవాలని కోరుతూ సదస్సులో తీర్మానం చేశారు. చలో ఢిల్లీ విజయవంతానికి దశలవారీగా ఇంటింటా ప్రచారం, జాతాలు నిర్వహించాలని సదస్సు నిర్ణయించింది.

సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షులు పొట్నూరు శంకరరావు, సిఐటి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడు అప్పారావు, కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ గోపాలం మాట్లాడారు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లోకవరపు ఆదినారాయణ మూర్తి, జిల్లా కమిటీ సభ్యులుగెద్ద లక్ష్మి, కోటి, తదితరులు పాల్గొన్నారు

కటకంవారి చెరువుపై
కబ్జాదారుల కన్ను



రోడ్డు నిర్మాణం ఆపాలని కోరుతున్న రైతులు

- అధికార పార్టీ అండతో రెచ్చిపోతున్న భూ బకాసురులు
- మొన్న పీర్ల గుండం.. నేడు కటకం వారి చెరువు
- సమీప రైతులపై దౌర్జన్యం
- రంగంలోకి రెవెన్యూ అధికారులు

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులు భూ బకాసురుల అవతారం ఎత్తారు. అధికారంలోకి వచ్చినప్పుడల్లా చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాలకు పాల్పడటం రాజకీయ గెద్దలకు పరిపాటిగా మారింది. తాజాగా జామి గ్రామంలో కటకం వారి చెరువు కబ్జాకు గురికావడం అందుకు నిదర్శనం. గ్రామ నడిబొడ్డున ఉన్న పీర్ల గుండం చెరువును మాయం చేసిన ఉదంతం మరవకముందే. కటకం వారి చెరువు కబ్జాకు సిద్ధమవుతున్న ఉదంతం బయటపడింది. ఈ నేపథ్యంలోనే సమీప రైతులు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు.

ప్రజాశక్తి - జామి

జామి గ్రామంలో సర్వే నంబర్ 456లో సుమారుగా 6.56 ఎకరాల్లో కటకం వారి చెరువు ఉంది. ఈ చెరువుపై సుమారుగా 100 ఎకరాల ఆయకట్టు రైతాంగం ఆధారపడి ఉంది. చెరువుకు సమీపంలో ప్లేవుడ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతోంది. ఇది పూర్తయితే, సుమారుగా 400 మందికి ఉపాధి కలుగుతుందని అంచనా. కంపెనీకి కటకం వారి చెరువుపై నుంచి రోడ్డు నిర్మాణానికి సిద్ధమయ్యారు. వాస్తవానికి చెరువు భాగాన్ని పక్కన బెట్టి, రోడ్డుకు సరిపడా భూమిని సమీప రైతుల నుంచి సేకరించాలి. అందుకు రైతుల అనుమతితో మార్కెట్ విలువ లెక్క నష్టపరిహారం చెల్లించాలి. ఇవేవీ చేయకుండా వైసిపి నాయకులు రంగంలోకి దిగారు. రైతులను బెదిరించి భయపెడితే, వారు భయపడి గొడవకు రాకుండా చూసుకుంటే, సమీప చెరువులోనుంచి రహదారి పూర్తిచేయొచ్చని భావించారు. అనుకున్నట్లే రైతుల భూముల నుంచి దౌర్జన్యంగా రోడ్డు వేయడానికి సిద్ధమయ్యారు. వారనుకున్నట్లు రైతులు మాత్రం భయపడలేదు. రోడ్డు నిర్మాణం అపాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే తహశీల్దార్ హేమంత్ కుమార్ రోడ్డును పరిశీలించి, చర్యలకు ఉపక్రమించారు.

గత పీర్లగుండంచెరువు కబ్జా సమయంలోనూ రైతులను బెదిరించి అక్కడ నుంచి వెళ్లగొట్టారు. అమాయక రైతాంగం భయపడటంతో అప్పటి రాజకీయ జిల్లా పెద్దల సాయంతో చెరువు కబ్జా సులువైంది. ఇది జరిగి ఏళ్లు గడిచినా నేటికీ ఆక్రమణ చెర నుంచి తమ చెరువును తప్పించాలని తహశీల్దార్ కార్యాలయానికి ఇరిగేషన్ అధికారులు లేఖలు రాస్తూనే ఉన్నారు. కానీ రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించిన పాపాన పోలేదు. తాజాగా కటకం వారి చెరువు చుట్టూ రైతులను బెదిరించి, కంపెనీ ముసుగులో చెరువు కబ్జాకు సిద్ధమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కటకం వారి చెరువుతోపాటు పీర్ల గుండం చెరువును కబ్జా చెర నుంచి కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రైతులు కోరుతున్నారు.

ఆక్రమణలపై చర్యలు

సర్వే నంబర్ 456లోని కటకంవారిచెరువులో 34 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించాం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. చెరువు కబ్జాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెడతాం.

- హేమంత్ కుమార్, తహశీల్దార్

చెరువు గర్భంలో రోడ్డు

చెరువు గర్భంలో రోడ్డు వేసిన విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. గతంలో పీర్ల గుండం చెరువుపై రెవెన్యూ అధికారులకు లేఖ రాసినా ఇంత వరకు చర్యలు లేవు.

- మూర్తి, ఇరిగేషన్ జెఇ

అన్ని రాజకీయ పార్టీలను
సమదృష్టితో చూడాలి

ప్రవర్తన నియమావళి కచ్చితంగా అమలు చేయాలి : జిల్లా ఎన్నికల అధికారి సూర్యకుమారి



జిల్లా ఎన్నికల అధికారి సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రచారాన్ని నిర్వహించుకునేందుకు అనుమతులు మంజూరు విషయంలో అన్ని రాజకీయ పార్టీల పట్ల సమదృష్టితో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తహశీల్దార్‌లు, ఎంపిడిఒలను ఆదేశించారు. అన్ని పార్టీలకూ సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టంచేశారు. సాధారణ ఎన్నికలకు వర్తించే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రస్తుత శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకూ వర్తిస్తుందని చెప్పారు. కొత్త పనులు మంజూరు, ప్రారంభం వంటివి చేపట్టకూడదని పేర్కొన్నారు. గతంలో మంజూరైన పథకాలు, పనులు కొనసాగించడానికి అభ్యంతరం లేదని తెలిపారు. మతపరమైన ప్రదేశాల్లో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎలాంటి ఎన్నికల ప్రచారాలు జరపకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని రెవిన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, తహశీల్దార్‌లు, ఎంపిడిఒలతో కలెక్టర్ శనివారం ఆన్ లైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రవర్తన నియమావళి అమలుపై ఆదేశాలు జారీచేశారు.

పట్టభద్రుల నియోజకవర్గంలో అర్హులైన ఓటర్లందరికీ వారు ఏ పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి, ఓటు వేసేందుకు ఎలాంటి గుర్తింపుకార్డులు తీసుకురావాలనే అంశంలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రవర్తన నియమావళి అమలుకు సహాయ రిటర్నింగ్ అధికారులు బాధ్యత వహించాల్సి వుంటుందని స్పష్టంచేశారు. పోలింగ్ విధులు నిర్వహించే ప్రభుత్వ సిబ్బంది అందరూ సర్వీస్ సర్టిఫికేట్ తీసుకొని ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి ఓటర్లుగా నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించి అర్హులైన వారికి ఓటుహక్కు కల్పించాలని ఆదేశించారు. తహశీల్దార్లు తమ వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తులపై తగిన విచారణ జరిపి ఆయా దరఖాస్తు దారుల అర్హత మేరకు వాటిని పరిష్కరించాలని సూచించారు. జిల్లాలోని ఎంపిడిఒలకు ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ సిఇఒ అశోక్ కుమార్‌కు సూచించారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు శేషశైలజ., అప్పారావు కూడా పాల్గొన్నారు.

రాజీ మార్గం శ్రేయస్కరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణచక్రవర్తి



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణచక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

మూడు నెలలకోసారి నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు ఉపయోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణచక్రవర్తి కోరారు. రాజీమార్గం ఎంతో శ్రేయస్కరమని ఆయన సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా కోర్టు సముదాయంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మంచి జీవితం కావాలంటే సమస్యలను పరిష్కరించుకొని, ప్రశాంతంగా ఉండాలని సూచించారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఎంతో సమయం ఆదా అవుతుందని చెప్పారు. ఇతర కేసులతోపాటు భార్యాభర్తల గొడవలను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసులను మూడు నెలల్లోనే పరిష్కరించడం జరుగుతోందన్నారు. జిల్లా అదనపు న్యాయమూర్తి కె.రాధారత్నం మాట్లాడుతూ ఏ సమస్యకైనా తప్పకుండా పరిష్కారం ఉంటుందని స్పష్టం చేశారు. పెద్దల సమక్షంలో సమస్యలను పరిష్కరించుకోవచ్చునని, సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చని, కుటుంబ తగాదాలను రాజీ చేసుకొని సంతోషంగా ఉండాలని సూచించారు. నాల్గవ అదనపు న్యాయమూర్తి (ఎస్‌సి, ఎస్‌టి ట్రయిల్ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి), షేక్ సికిందర్ భాషా మాట్లాడుతూ, రాజీయే రాజమార్గమన్నది లోక్ అదాలత్ ఉద్దేశమని పేర్కొన్నారు. సివిల్ కేసులు, చిన్నచిన్న క్రిమినల్ కేసులను కూడా రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఫ్యామిలీకోర్టు న్యాయమూర్తి ఎం.మీనాదేవి మాట్లాడుతూ, లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. ముఖ్యంగా ఐదు సంవత్సరాలు పైబడిన కేసులపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.సంజీవరావు, జిల్లా న్యాయసేవల సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బిహెచ్‌వి లక్ష్మీకుమారి, పలువురు న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 481 కేసులు పరిష్కారం

శృంగవరపుకోట : జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 481 కేసులు పరిష్కారమైనట్లు జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి వెల్లడించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐపిసి కేసులు 18, చెక్ బౌన్స్ కేసులు 9, ప్రాంశరినోట్ కేసులు 7, టైటిల్ స్యూట్లు 2, ఇపి 8, మనోవర్తి 1, బ్యాంకు పిఎల్‌సి 1, ద్వితీయ శ్రేణి న్యాయస్థానం క్రిమినల్ కేసులు 435.. మొత్తం 481 కేసులను న్యాయమూర్తి వాణి పరిష్కరించారు. కార్యక్రమంలో ఎపిపి పి.కేశవరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లు సత్యాజీ, ప్రధాన కార్యదర్శి కెవిఎస్ రామరాజు, సీనియర్ న్యాయవాదులు జి.సూరిదేముడు, బి.త్రిమూర్తులు, మామిడి చంద్రశేఖర్, డబ్ల్యు.ఎన్.శర్మ, వారాది ఈశ్వరరావు, టివిఆర్ మూర్తి, ఆర్.సత్యనారాయణ, బి.సత్యనారాయణ, ఎం.అప్పారావు, ఎం.అనూరాధ, బివిఎస్ రామారావు, జి.చిట్టిబాబు, బి.వెంకటరావు, డెక్కా త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఖజానా అధికారి గణేష్ మృతి

ప్రజాశక్తి-విజయనగరం



గణేష్ (ఫైల్)

జిల్లా ఖజానా అధికారి ఎస్ఆర్‌కె గణేష్ శనివారం తెల్లవారి కన్నుమూశారు. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయన మృతికి మూడు జిల్లాల ఖాజానా అధికారుల సంఘం నాయకులు , అధికారులు, ఉద్యోగులు నివాళులు అర్పించారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఖజాన శాఖ డిడి ఆర్ఎఎస్ కుమార్, ఎటిఒ నితిన్ జోసి, ఎటిఒ ఆదిత్యసింగ్, ఎపిటిఎస్ఎ పద్మనాభం, ఆదినారాయణ, రామరాజు, సుధాకర్, తదితరులు సంతాపం తెలిపారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి-బొబ్బిలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు కోరారు. రాజా కళాశాల మైదానం, కోటిచెరువు గట్టుపై రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని శనివారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పక్షాన పని చేసే పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.యుగంధర్ ఉన్నారు.

13న పింఛనుదారుల ధర్నా

ప్రజాశక్తి-నెల్లిమర్ల


ఈ నెల 13న పింఛనుదారుల సమస్యలపై జిల్లా కేంద్రంలోని పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు పింఛనుదార్ల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పింఛన్లు పెంచుతామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా పెంచలేదన్నారు. దీంతో అఖిల భారత పింఛనుదార్ల సంఘం ఆందోళనలకు పిలుపునిచ్చిందన్నారు. దీనిలో భాగంగా చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

హౌసింగ్ డేలో అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-మెంటాడ

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డిఇ ఎం.సత్యనారాయణ సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మెంటాడలో జగనన్న లేఅవుట్‌ను అధికారులు సందర్శించారు. లబ్దిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆయన కోరారు. లేవుట్‌లో విద్యుత్, తాగునీరు మొదలగు మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నిర్మాణాల్లో జాప్యమవుతున్నట్లు లబ్దిదారులు అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. మౌలిక సదుపాయాల కల్పనను ముమ్మరం చేస్తున్నామని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ డేవిడ్ ప్రసన్న కుమార్, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, విఆర్‌ఒ రెడ్డి అప్పలనాయుడు, హౌసింగ్ సిబ్బంది శేఖర్, ఆర్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

అందుబాటులో అధునాతన వైద్య సేవలు

తిరుమల మెడికవర్ ఆస్పత్రి వార్షికోత్సవంలో జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం

సామాన్య మధ్య తరగతి వర్గాల ప్రజలకు అందుబాటులో అధునాతన వైద్య సేవలు అందించడమే కార్పొరేట్ ఆసుపత్రుల లక్ష్యం కావాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రి వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో తిరుమల ఆసుపత్రి అధునాతన వైద్య సేవలు అందించడంలో ముందంజలో ఉందని ప్రశంసించారు. అత్యంత క్లిష్టమైన కేసులను కూడా ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన కేసులు ఎన్నో ఉన్నాయని గుర్తుచేశారు. ధనార్జనే ధ్యేయం కాకుండా పేద, మధ్య తరగతి వర్గాలకు అధునాతన వైద్యం అందించినప్పుడే కార్పొరేట్ ఆసుపత్రి యాజమాన్యాలకు ప్రజల్లో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ కృష్ణ శాంతి, మెడి కవర్ హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ పద్మజ, ఆసుపత్రి సెంటర్ హెడ్ పద్మకుమార్, డాక్టర్ పిఎస్‌వి రామారావు, డాక్టర్ మహేశ్వర రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రచ్చబండ ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట


మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో ఆధునీకరించిన రచ్చబండను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమారి మీనా, వైస్ సర్పంచ్ అడారి అప్పారావు, మాజీ సర్పంచ్ కె.సత్యనారాయణ, నాయకులు శ్రీరాములు, సత్యం, మురళీరాజు, కేతా వీరన్న, సన్యాసిదేముడు, చిన అప్పారావు పాల్గొన్నారు.

ఆచరణపైనే అనుమానం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇటీవల ప్రభుత్వం తీరుసుకున్న పలు నిర్ణయాలు హర్షణీయం. జిల్లా అభివృద్ధికి ఎంతోకొంత దోహదపడతాయి. కానీ, వాటి అమలు, అందుకు చూపే చిత్తశుద్ధిపైనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈ అనుమానాలను తొలగించాలంటే వచ్చే ఎన్నికల వరకు నాన్చుడు ధోరణి అవలంభించి, 'మళ్లీ అధికారంలోకి వస్తే చేసి చూపిస్తాం' అని చెప్పేందుకు ప్రయత్నించకుండా ఒక అడుగు ముందుకు వేయాల్సివుంది.


ఈనెల 7వ తేదీన జరిగిన పెట్టుబడిదారుల సమావేశంలో భోగాపురం మండలంలో 90 ఎకరాల్లో ఐటి పార్కు ఏర్పాటు చేస్తామని, ఎస్.కోట దరి మూలబొడ్డవరలో గతంలో అల్యూమినా కంపెనీ కోసం సేకరించిన 985ఎకరాల భూమిని స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు కేటాయిస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. ఐటి పార్కు ఏర్పాటు చేస్తే స్థానికంగా కొంతమందికైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. అలాగే అల్యూమినా కంపెనీ ఎలాగూ పెట్టలేదు కాబట్టి ఆ స్థానంలో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల వెనుకబడిన విజయనగరం జిల్లా పారిశ్రామికంగా ఒక్క అడుగైనా ముందుకు వేసేందుకు అవకాశం కలుగుతుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ప్రత్యక్షంగా పరోక్షంగా కలుగుతాయి. ఇంత వరకు బగానే ఉన్నా వాటి అమలు విషయంలో ప్రజల్లో నమ్మకం సడలుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఇప్పటి వరకు మన జిల్లాకు సంబంధించినంత వరకు ఎన్నికల ముందు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు పెద్దగా నెరవేరలేదు. ఈ మాటకొస్తే టిడిపి ప్రభుత్వం ఏర్పాడ్డాక చెప్పినవి కూడా అమలుకు నోచుకోలేదు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ప్రాంతాల మధ్య సమతుల్యత పాటించే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని గతంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అది మన జిల్లాకు అన్వయించుకుంటే విజయనగరాన్ని పారిశ్రామిక నగరంగాను, స్మార్ట్ సిటీగాను మారుస్తామని, లలిత కళల సంగీత అకాడమీ ఏర్పాటు చేస్తామని, జిల్లాలో ఫుడ్‌పార్కులు ఏర్పాటు చేస్తామని, సముద్ర



తీరంలో పోర్టు నిర్మిస్తామని, ఏడాదిలో తోటపల్లి ప్రాజెక్టు పనులన్నీ పూర్తిచేసి, శతశాతం సాగునీరు అందిస్తామని, మెడికల్ కాలేజీ, గిరిజన వర్శిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. భోగాపురంలో తలపెట్టిన ఇంటర్నేషల్ ఎయిర్‌పోర్టు కూడా తామే పూర్తిచేస్తామంటూ నమ్మబలికింది. ఎన్నికలకు ముందుకు గురజాడ పేరిట ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తామంటూ అప్పటి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి ప్రకటించింది. కానీ, వీటిలో గిరిజన వర్శిటీని పారాయి పంచన ప్రారంభించడం మినహా మరేవీ అమలుకు నోచుకోలేదు. గిరిజన యూనివర్శిటీ ప్రారంభమై సుమారు నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ వైసిపి హయాంలోనూ శాశ్వత ప్రాతిపదికన భవన సముదాయం లేదు. లేబొరేటరీ, గ్రంథాలయం వంటివి కూడా లేకపోవడంతో అక్కడి విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలపై ఆధారపడుతున్నారు. ఎయిర్‌పోర్టు, గిరిజన వర్శిటీలకు ఇంకా భూసేకరణే పూర్తికాలేదు. మెడికల్ కాలేజీ పనులు మాత్రం వైసిపి అధికారంలోకి వచ్చాకే ప్రారంభమయ్యాయి. తోటపల్లి ప్రాజెక్టుపై అటు టిడిపి, ఇటు వైసిపి నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇప్పటికీ లక్ష్యంలో 60శాతానికి మించి సాగునీరు అందడం లేదు. ఇక మిగిలినవాటి ఆచూకీయే లేదు. ఇటువంటి పరిస్థితుల్లో తాజాగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన ఐటి పార్కు, స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ జిల్లా వాసుల్లో ఒకింత ఆశలు రేకిస్తున్నప్పటికీ, అదే స్థాయిలో అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈనేపథ్యంలో హామీలను ఎన్నికలకు ముందే అమలు చేస్తే ప్రభుత్వాన్ని విశ్వసించే పరిస్థితి ఉంటుందని, లేదంటే టిడిపి, వైసిపి దొందూ దొందే అన్న చందంగా అనుకోవాల్సి వస్తుందని పబ్లిక్ టాక్. వీటికితోడు బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశం జిల్లాలో పాలనా సౌభ్యానికి, పలు అభివృద్ధి పనులకు నిర్ణయం తీసుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం అర్బన్‌ను ప్రత్యేక మండలంగా గుర్తించేందుకు తీసుకున్న నిర్ణయం వల్ల ప్రభుత్వ సేవలు త్వరితగతీన అందుతాయనే ఆశాభావం విజయనగరంవాసుల్లో వ్యక్తమౌతోంది. జిల్లా కేంద్రంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు, లీగల్ సర్వీస్ ఇనిస్టిట్యూట్‌లో పోస్టుల భర్తీకి నెల్లిమర్ల నగర పంచాయతీని విజయనగరం రెవెన్యూ డివిజన్‌లో వీనం చేసేందుకు, నెల్లిమర్లలో సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్లు ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలపడం పట్ల కూడా హర్షం వ్యక్తమౌతోంది.

రాజుల పాలనలో వెనుకబాటు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

15 ఏళ్ల రాజుల పాలనలో బొబ్బిలి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. వైసిపి కార్యాలయంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, కౌన్సిలర్లకు శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి విజయానికి అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం, విద్య అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వంపై ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తుందని, దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బొబ్బిలిలో వైసిపి చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రైతులకు మద్దతుధర కల్పించి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరు చేస్తుందని చెప్పారు. బొబ్బిలి రాజులకు పేటెంట్ కాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, జెసిఎస్ పట్టణ కన్వీనర్ రేజేటి విస్సు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు అసమ్మతి కౌన్సిలర్లు డుమ్మా

వైసిపి కార్యాలయంలో నిర్వహించిన శిక్షణకు అసమ్మతి కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. మున్సిపల్ బడ్జెట్ సమావేశం నుంచి వైసిపి కౌన్సిలర్లలో విభేదాలు తలెత్తాయి. మూడు రోజుల క్రితం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సమక్షంలో పంచాయితీ జరిగింది. అందులో ఇక నుంచి కలిసి పనిచేయాలని ఆదేశించినా ముందుకు రాలేదు. అసమ్మతి కౌన్సిలర్లకు ప్రాధాన్యత ఇవ్వడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

సన్ స్కూల్లో ప్రోగ్రెసివ్ పేరెంటింగ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక సన్ స్కూల్‌లో ప్రోగ్రెసివ్ పేరెంటింగ్ అనే వినూత్న కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్ట్, కెరీర్ కౌన్సిలర్ అయిన సుధీర్ కుమార్ సాంద్ర మాట్లాడుతూ 6,7,8 తరగతులు చదువుతున్న విద్యార్థులలో శారీరకంగా, మానసికంగా, సామాజికంగా వచ్చే మార్పుల వల్ల ఒత్తిళ్లకు గురవుతారని వారిని మనం సక్రమమైన పద్ధతిలో అవగాహన చేసుకుని, వారికి తగిన ప్రోత్సాహాన్ని ఇస్తూ, వారి మనసులను నొప్పించకుండా, ఇంకొకరితో పోలిక చెయ్యకుండా, పొరపాట్ల వలన వచ్చే అనర్థాలను తెలియజేస్తూ, వారితో ఎక్కువ సమయం గడపాలని అన్నారు. తద్వారా వారిలో ఉండే భయం, అభద్రతా భావాలు తొలగిపోయి స్వేచ్ఛగా జీవిస్తారని అన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అనిల్ కుమార్, ప్రిన్సిపల్ రవీంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ అనంతసాగరంలో చేపడుతున్న ఉపాధి పనులను శనివారం ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేయాలన్నారు. అప్పుడే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. కూలీల పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సువ్వాడ గౌరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.


కర్రోతును సన్మానిస్తున్న టిడిపి నెల్లిమర్ల మండల అధ్యక్షులు ఆనందకుమార్, రవిశేఖర్

ఐక్యంగా పార్టీ పటిష్టతకు కృషి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బంగార్రాజు

ప్రజాశక్తి -భోగాపురం

నియోజకవర్గంలో టిడిపి పటిష్టత కోసం ఐక్యంగా కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు కోరారు. శనివారం పోలిపల్లిలో టిడిపి నెల్లిమర్ల మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు ఆధ్వర్యాన బంగార్రాజును సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-వేపాడ


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం భాస్కరరావు

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అండర్-17 విభాగంలో సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.అన్నపూర్ణ, పి.భార్గవి ఎంపికైనట్లు హెచ్‌ఎం బాలభాస్కరరావు తెలిపారు. విద్యార్థినులను హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు వివి రమణారావు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

ప్రజాశక్తి - విజయనగరం కోట

యువత రక్తదాన శిబిరానికి స్వచ్ఛందంగా తరలిరావాలని క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి ఎమ్‌డి రమేష్ కుమార్ కోరారు. శనివారం స్థానిక హాస్పిటల్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్‌లో మేమున్నాం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30గంటలకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత ముందుకు వచ్చి రక్త దానం చేస్తే రానున్న వేసవికాలంలో రక్తం కొరత తీర్చేందుకు అవకాశం ఉంటుందన్నారు.

జెసిఎస్ మండల కన్వీనర్‌గా శ్రీను

ప్రజాశక్తి-వేపాడ


బోజంకి శ్రీను

జెసిఎస్ మండల కన్వీనర్‌గా బోజంకి శ్రీను నియమితులయ్యారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు.. శ్రీనుకు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా బోజంకి శ్రీను మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి శక్తి మేరకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని చినబూరాడపేటలో మహిళా ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కేన్సర్‌పై శనివారం అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కె.ఆర్.డి ప్రసాదరావు, వైద్య బృందం వేణు గోపాల్ రెడ్డి, నిహారిక పాల్గొని గ్రామస్తులకు కేన్సర్ సంబంధిత సూచనలిచ్చారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బెల్లాన రామారావు, వైస్‌సర్పంచ్ సత్యనారాయణ, పైడినాయుడు, కృష్ణ, రమణ, శ్రీను, సామాజిక కార్యకర్త సిహెచ్ సత్యనారాయణ, రెడ్‌క్రాస్ ఫీల్డ్ సిబ్బంది గౌరిశంకర్, రమణ పాల్గొన్నారు.

ఘనంగా ఫోర్టు సిటీ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫోర్టు సిటీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల చైర్మన్ కెవిపి శివ పాఠశాల ఏర్పాటు అయినప్పటి నుంచి నేటి వరకు చేసిన కృషి, నివేదికను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ కళారూపాలు ప్రదర్శించారు. పాటలు, డాన్సులు, వివిధ పోటీల్లో పాల్గొని అలరించారు. పోటీల్లో విజేతలకు చైర్మన్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ చంటి, డైరెక్టర్లు మధు, నీలిమ, అశోక్, ప్రిన్సిపాల్ పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఇసి మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని మెరకముడిదాం, గర్భాం పిహెచ్‌సిల పరిధిలో విద్యార్థులకు శనివారం వైద్యాధికారులు కె.సాంబమూర్తి, అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. గర్భాం పిహెచ్‌సి పరిధిలో 85, మెరకముడిదాం పిహెచ్‌సి పరిధిలో 87 శాతం డిఇసి మాత్రలు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అనిల్ రామ్ కుమార్ రెడ్డి, అజయ్ కుమార్, కె.సాంబమూర్తి, అజిత్ బాబు, ఎంపిహెచ్‌ఇఒలు నాగేంద్ర ప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగునీరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పూల్‌బాగ్ ప్రధాన రహదారిలో మురుగునీరు రహదారిపై పారుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలువ వ్యవస్థ లేకపోవడం వలన వీధుల్లో నుంచి వస్తున్న మురికి నీరు ప్రధాన రోడ్డు పైకి రావడంతో పాద చారులు, వాహనాలు మీద వచ్చే వారు వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే ఉన్న కాలువ పూర్తిగా సిల్టు పేరుకుపోవడంతో మురుగునీరు ప్రధాన రహదారిపై వచ్చేసింది. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించకపోతే రోడ్డు మొత్తం మురుగునీరు చేరి రాక పోకలకు ఇబ్బంది కలిగే పరిస్థితి ఏర్పడుతుంది. వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న మురుగునీరు

ధాన్యం నిల్వల పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని కొండగుంపాం, చంద్రంపేట పరిధిలో రైతుల వద్ద ధాన్యం నిల్వలు, రబీ ఇ-పంట నమోదును శనివారం వ్యవసాయశాఖ జెడి కె.త్రినాథస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పొలాల్లో ఉన్న ధాన్యం బస్తాలను పరిశీలించారు. ఇంకా ఎంత మొత్తంలో ధాన్యం రైతుల వద్ద ఉన్నాయో ఆర్‌బికె వారీగా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన చెప్పారు. రబీలో పంటలు సాగుచేస్తున్న రైతులు ఆర్‌బికెలో విఎఎలను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి ఎన్.కోటేశ్వరరావు, ఎఒ ఎం.పూర్ణిమ, ఎఇఒ ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్ల : మండలంలో గూడెం గ్రామంలో ధాన్యం నిల్వలను వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామి పరిశీలించారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం వివరాలను సేకరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. మండలంలో 1300 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఈ సందర్భంగా గూడెం రైతులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి కోటేశ్వరరావు, ఎఒ, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు భవనం పరిశీలన

ప్రజాశక్తి-కొత్తవలస


ఎస్‌సి హాస్టల్‌ను పరిశీలిస్తున్న బృందం

బిసి బాలికల వసతిగృహ విద్యార్థుల కోసం భవనాన్ని శనివారం ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్ బృందం పరిశీలించింది. ఇటీవల బిసి బాలికల హాస్టల్ విద్యార్థులు 24 మంది తీవ్ర అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ సీరియస్‌గా తీసుకొని, ఈ ప్రాంతం నుంచి గర్ల్స్ హాస్టల్ విద్యార్థులను హైస్కూల్ దగ్గర ఉన్న వేరే హాస్టల్‌కు తరలించడానికి కావాల్సిన వసతులపై పరిశీలన చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్, డిఇ పైడిరాజు, ఎఇ ఆర్.సన్యాసిరావు, డిబిసిడబ్ల్యుఒ ఎం.యశోదరావు, ఎఎస్‌డబ్ల్యుఒ బి.రామానందం, బి.సత్యం బృందం హాస్టళ్లను పరిశీలించింది. విద్యార్థినులు పాఠశాలకు వెళ్లడానికి అనువైన ప్రాంతంగా ఎస్‌సి బాలుర హాస్టల్ ఉందని అభిప్రాయపడ్డారు. ఇక్కడ చదువుతున్న కళాశాల విద్యార్థులను, ఇప్పుడున్న బిసి గర్ల్స్ హాస్టల్‌కు పంపించాలని నిర్ణయించారు. ఈ హాస్టల్లో చిన్న చిన్న మరమ్మతులు చేయాలని ఎస్ఇ అధికారులకు

26న ప్రజ్ఞావికాస పరీక్ష

ప్రజాశక్తి-బొబ్బిలి



ప్రజ్ఞావికాస పరీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యాన పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 26న ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఎస్‌ఎఫ్‌ఐ బొబ్బిలి మండల కార్యదర్శి ఎస్.కేశవ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రజ్ఞా వికాస పరీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, పదో తరగతి విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహిం చేందుకు ప్రజ్ఞా వికాస పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో ప్రశ్నపత్రం తయారు చేసినట్లు తెలిపారు. పరీక్షలో రాణించినవారికి నగదు బహుమతులు అందిస్తున్నట్లు చెప్పారు. వివరాల కోసం 7013378783, 9642688591 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వాసు, డేవిడ్, యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - జామి

వాసవి క్లబ్ జామి యూత్ నూతన క్లబ్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవియన్ క్రౌన్ స్టార్ కపుల్ కెసిజిఎఫ్ ఐఎన్‌వి సంతోష్ చక్రవర్తి, రీజియన్ జోన్ గవర్నర్ కెసిజిఎఫ్ ఆత్మకూరి సతీష్, వైస్ గవర్నర్ సాంబమూర్తి హాజరయ్యారు. యూత్ క్లబ్ మండల నూతన అధ్యక్షులుగా తీగెల సతీష్‌కుమార్, కార్యదర్శిగా కాపుగంటి రంజిత్ కుమార్, కోశాధికారిగా బొండాడ రామకృష్ణ మోహన్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పసుమర్తి అప్పలరాజు, మండల అధ్యక్షులు వాకచర్ల భాస్కర్‌రావు, జామి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు విన్నకోట సీతారామయ్య పాల్గొన్నారు.

పాదయాత్రను అడ్డుకోవడం సరికాదు

ప్రజాశక్తి-వేపాడ


గొంప వెంకటరావు

టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్రను అడ్డుకోవడం సమంజసం కాదని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు పేర్కొన్నారు. వేపాడ మండల కేంద్రంలో శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. శాంతియుతంగా పాదయాత్ర చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అడుగడుగునా పోలీసులతో అనేక రకాల కారణాలు చూపి పాదయాత్ర సుజావుగా సాగకుండా ఆటంకాలు కల్పించడం దారుణమన్నారు. మైక్‌లో మాట్లాడే అవకాశం కూడా లేకుండా చేయడం దుర్మార్గపు ఆలోచనని విమర్శించారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టినప్పుడు ఏ అనుమతులు తీసుకున్నారని ప్రశ్నించారు. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఆటంకాలు కలిగిస్తే పాదయాత్ర సజావుగా సాగించేవారా? అని నిలదీశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనుసరిస్తున్న తీరును మార్చుకొని, లోకేష్ సాగిస్తున్న పాదయాత్ర సజావుగా సాగే విధంగా తగు రక్షణ కల్పించాలని డిమాండ్‌చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.


ప్రజల సంతోషమే గడపగడపకూ లక్ష్యం

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు హారతిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస -4లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు వివరించారు. సమస్యలు తెలుసుకొని అక్కడి నుంచే అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో కూడా ప్రజా సంక్షేమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, ఎఎం సి వైస్ చైర్మన్ బొంతుల వెంకటరావు, మేలాస్త్రి అప్పారావు, పంచాయతీ సర్పంచ్ మచ్చా ఎర్రయ్య రామస్వామి, లెంక భాస్కర్, ఐతంశెట్టి అనిల్ కుమార్, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మహమ్మద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

క్రీడాకారుడికి ఘన సన్మానం


ప్రజాశక్తి-శృంగవరపుకోట

బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మహమ్మద్ ఖలీలుల్లాను పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం సన్మానించారు. క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వి సత్య శేఖర్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, స్నేహ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అట్లూరి వెంకట్రావు.. మహమ్మద్‌ను సత్కరించారు. జాతీయ స్థాయి పోటీలకు మహమ్మద్ వెళ్లేందుకు అయ్యే ఖర్చును సమకూరుస్తానని ఎమ్మెల్సీ తెలిపారు. క్రీడాకారుడికి ముంతాజ్ హోటల్ యజమానులు సిలార్, ఖాదర్, రసూల్ వారి తనయులు బ్యాడ్మింటన్ కిట్, ప్రొద్దుటూరుకు చెందిన సోదరుడు ముగ్ధుమ్ బ్రదర్స్ షూను అందించారు. ఈ కార్యక్రమంలో ఆనల రమేష్, ఆనల మోహన్, ఎమ్మార్ కోర్టు అధ్యక్షులు సూరిబాబు, జెకె కోర్టు అధ్యక్షులు జెకె మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా గుర్రపు పరుగు పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని చిన్నగుడిపాల గ్రామంలో పరదేశమ్మ తీర్థం సందర్భంగా ఏర్పాటుచేసిన గుర్రపు పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 15 గుర్రాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు నగదు బహుమతులను డిసిసిబి చైర్మన్ వివి చినరామునాయుడు, సర్పంచ్ రామునాయుడు, మాజీ సర్పంచ్ గొర్లె నాగరాజు, కె.పెదనాయుడు అందజేశారు.


పరుగు పోటీలో పాల్గొన్న గుర్రం

వైసిపి సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా పైడినాయుడు

ప్రజాశక్తి-గుర్ల


మంత్రి పైడినాయుడు

వైసిపి సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా మంత్రి పైడి నాయుడు, కో-కన్వీనర్లుగా పతివాడ కృష్ణమోహన్, వల్లూరి నరసింహమూర్తి, మీసాల సంతోష్, సిరిపురపు గణేష్ నియమితులయ్యారు. తమకు బాధ్యతలు అప్పగించిన మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కెవి సూర్యనారాయణరాజు, ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, మండల నాయకులు పొట్నూరు సన్యాసినాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆపన్నహస్తం

ప్రజాశక్తి-బాడంగి


స్నేహితుడికి ఆర్థిక సాయం చేస్తున్న పూర్వవిద్యార్థులు

కష్టకాలంలో ఉన్న తోటి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ఆపన్నహస్తం అందించారు. బాడంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1991- 92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గత నెల భోగి నాడు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కలిసి సందడి చేశారు. అక్కడితో దానిని మర్చిపోకుండా తమతో కలిసి చదువుకొని, కష్టకాలంలో ఉన్న స్నేహితులను సాయం చేయాలని నిర్ణయించారు. కరోనా వైరస్‌తో భర్తను కోల్పోయిన టేకు పద్మకు శనివారం రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. ప్రమాదవశాత్తూ భర్తను కోల్పోయిన యామల రమణమ్మకు రూ.10 వేలు, బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో ఉద్యోగం చేస్తూ ప్రమాదానికి గురైన చింతల గోపాల్‌నాయుడుకు రూ.10 వేలు సాయం చేశారు. వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గొర్లి ప్రకాశ్‌రావు, పి.శ్రీనివాసరావు, కొల్లి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-శృంగవరపుకోట


బి.గణేష్ (ఫైల్)

పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులో నివాసం ఉంటున్న బర్ణికాన గణేష్ (27) తన ఇంట్లో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందాడు. పక్క ఇంటివారు గుర్తించి చుట్టుపక్కల వారికి తెలియ జేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. కొద్దిరోజులుగా భార్య భర్తల మధ్య తగాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. భార్య కామేశ్వరి భర్త వేధిస్తున్నారంటూ శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కానిస్టేబుళ్లు ఇంటికి వచ్చి పరిశీలించి వెళ్లారు. ఎస్.కోటలోనే నివాసం ఉంటున్న గణేష్ మావయ్య మురళి వీరి ఇంటికి వచ్చి కుమార్తె కామేశ్వరిని, ఇద్దరు మనుమలను తమ ఇంటికి తీసుకెళ్లారు. ఈలోగా శుక్రవారం రాత్రి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. అయితే గణేష్ మృతదేహం కిందికి కాళ్లు తగిలేలా వేలాడటం, కాలి నుండి రక్తం కారుతుండటంతో ఆయన మృతి పట్ల పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎస్.ఐ జె.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం స్థానిక సిహెచ్‌సికి తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జామి

జామి గ్రామ సమీపంలో లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన బండారు ప్రసాద్ రావు (49) అనే రైతు పొలంలోకి వెళుతుండగా, జాగారం వైపు నుంచి వస్తున్న లారీ వెనుక భాగాన బలంగా ఢీకొంది. దీంతో ప్రసాదరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి 108 వాహనంలో జామి పిహెచ్‌సికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ వీరబాబు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనం హైవే పనులు చేస్తున్న లారీగా పోలీసులు గుర్తించారు.

గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని చింతాడవలస గ్రామంలో శనివారం పూర్ణాన అక్కునాయుడు ఇంట్లో గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదంలో రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంకు పుస్తకాలు, రూ.5వేలు నగదు, తిండి గింజలు, వంట పాత్రలు, దుస్తులు కాలి బూడిదయ్యాయి. గ్యాస్ కారణంగా ప్రమాదం జరిగినట్లు తెలుసుకున్న గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. మంటలు అదుపు చేయడానికి ఏ ఒక్కరూ సాహసించ లేకపోయారు. విఆర్‌ఒ గణపతి నష్ట వివరాలను సేకరించారు. ఆస్తి నష్టం సుమారు లక్ష రూపాయలకు పైబడి ఉంటుందని సర్పంచ్ గేదెల అన్నపూర్ణ, వైసిపి నాయకులు గేదెల సతీష్ తెలిపారు.


కాలిపోతున్న ఇల్లు